సాక్షి
వనపర్తి
సోమవారం । 5 । మే । 2025



ఖనిజ సంపద దోపిడీకే..

అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపద దోచేందుకే కేంద్రం కుట్ర చేస్తోందని జాన్‌వెస్లీ ఆరోపించారు.

వివరాలు 8లో ▸



'నీట్'గా రాశారు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆదివారం నీట్ ప్రశాంతంగా కొనసాగింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.2 /25.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు వేడి గాలులు వీయడంతో పాటు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

చరిత్ర పుస్తక రూపంలో పదిలం



వనపర్తి టౌన్: చరిత్రను పుస్తక రూపంలో భద్రపరిస్తే భవిష్యత్ తరాలు తెలుసుకొనే వెసులుబాటు ఉంటుందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. కొల్లాపూర్ మండలం ఎల్లూరులో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసి 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'జ్ఞానదర్శిని ఎల్లూరు చరిత్ర' పేరున రూపొందించిన పుస్తకాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలో సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. కవులు, కళాకారులు, రచయితలు, చరిత్రకారులు, విద్యావంతులు గతంలోని అంశాలను శోధించి, ధ్రువీకరించుకొని పుస్తక రూపంలోకి తీసుకొస్తారని, ఒక పుస్తకం వెనుక ఎంతో ప్రయత్నం, పర్యవేక్షణ ఉండటంతో వాటిలోని విజ్ఞానం నేటి సమాజానికి అందుతుందని చెప్పారు. ఈ గ్రంథ రచనకు నిరంజనయ్య కృషిని ఆయన కొనియాడారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఎల్లూరు కొల్లాపూర్ సంస్థానానికి కొంతకాలం పాటు రాజధానిగా ఉందని.. చోళులు, కాకతీయుల కాలానికి సంబంధించిన ఆనవాళ్లు అక్కడ ఉన్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు జనజ్వాల, ఓంకార్, బైరోజు చంద్రశేఖర్, శ్యాంసుందర్, రాజారాంప్రకాశ్, కిరణ్‌కుమార్, గంధం నాగరాజు, డి.కృష్ణయ్య, ఆనంద్, దాసరి కృష్ణ, మోజర్ల కృష్ణ, సురేందర్, రంగస్వామి, వహీద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం : బీజేపీ



ఖిల్లాఘనపురం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం పోరాడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, మండల ఇన్‌చార్జ్ సీతారాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బూత్ అధ్యక్షుడు శివ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని కార్యవర్గ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు పని చేయాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి పార్టీ తరుపున కృషి చేయాలని, అలాంటప్పుడే ప్రజల్లో పార్టీపై, నాయకులపై మంచి అభిప్రాయం కలుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కేంద్ర పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, మండల ప్రధానకార్యదర్శులు దశరథం, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.రాజు, గోపి ముదిరాజ్, చక్రవర్తిగౌడ్, హేమంత్ నాయక్, ఎస్.సాయినాథ్, శివ, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పల్లె పాలన

గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కరువు



అమరచింత మండలం ఈర్లదిన్నెలో మురుగుకాల్వ దుస్థితి

- పనిభారంతో సతమతమవుతున్న పంచాయతీ కార్యదర్శులు
- చెత్త సేకరణ వాహనాలకు డీజిల్, బోర్ల మరమ్మతుకు నిధుల లేమి
- జిల్లాలో 255 గ్రామపంచాయతీలు



కొంకన్వానిపల్లిలో విద్యుత్ తీగలను సరిచేసుకుంటున్న కాలనీవాసులు (ఫైల్)

అమరచింత: సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి రెండేళ్లు గడుస్తుండటం.. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులపైనే పనిభారం పెరగడం.. 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరుగాక కార్మికులకు ప్రతి నెలా వేతనాలు అందకపోవడం తదితర కారణాలతో గ్రామాల్లో పాలన పడకేసింది. గతేడాది జనవరి 31న సర్పంచుల పదవీకాలం ముగియగా.. ప్రభుత్వం ఫిబ్రవరి 1న క్లస్టర్ గ్రామాలు ఎంపికచేసి జిల్లాలో మొత్తం 255 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. వారికి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం నిధులు, విధులపై స్పష్టత లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. గ్రామపంచాయతీల బ్యాంకు ఖాతాలు ఖాళీగా ఉండటంతో కనీసం వీధిదీపాలు, బోర్ల మరమ్మతులు, గ్రామపంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. పంచాయతీల్లో విధులు నిర్వర్తించే మల్టీపర్పస్ వర్కర్స్‌కు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి తలెత్తింది.

పనిభారం.. నిధులు కరువు...



పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. దీంతో గ్రామంలో కనీస మౌలిక వసతుల కల్పనకు తప్పనిసరిగా అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి బోర్ల మరమ్మతులకు పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలను ప్రత్యేక అధికారులకు విన్నవిస్తున్నా.. నిధులు లేక పరిష్కరించలేక పోతున్నాం.

– రాజిక్, పంచాయతీ కార్యదర్శి, మోట్లంపల్లి (ఆత్మకూర్)

నిధులు మంజూరైతేనే..



గ్రామపంచాయతీల్లో కొత్త పాలకవర్గం కొలువు దీరాలి. ఇందుకుగాను పంచాయతీ ఎన్నికల నిర్వహణ జరగాలి. ప్రభుత్వం త్వరలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరుగాకపోవడంతో చిన్న పంచాయతీల్లో నిర్వహణ భారంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య నెలకొంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

– సురేష్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి

కార్యదర్శులకు తప్పని తిప్పలు..

హరితహారం, ఉపాధిహామీ, పల్లెప్రగతి, పన్నుల వసూలు, జనన, మరణాల నమోదు, కల్యాణలక్ష్మి తదితర పనులతో పంచాయతీ కార్యదర్శులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పెద్ద గ్రామపంచాయతీల్లో తాగునీరు, ఇంటి పన్ను వసూలు చేసి అత్యవసర పనులు చేయించుకుంటుండగా.. వెయ్యిలోపు జనాభా ఉన్న గ్రామాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గతంలో చెత్త సేకరణకు కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ఆటోలు పంచా యతీ కార్యదర్శుల పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. దీంతో పంచాయతీల్లో ఉన్న నిధులన్నీ ముందస్తుగానే వాటి కిస్తులకు చెల్లించడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. గ్రామాల్లో మురుగు కాల్వల మరమ్మతులు, తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు సరిచేయడం తదితర అత్యవసర పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

నిధులు రాక ఇబ్బందులు..

గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ ఇచ్చే నిధులు ప్రధాన ఆదాయ వనరులు. జనాభా ఆధారంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15 ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తారు. కానీ 2022, ఆగస్టు నుంచి ఆయా నిధులు రావడం లేదు. పెద్ద పంచాయతీల్లో ఇంటి పన్నులు, తైబజార్, ఇంటి నిర్మాణ ఫీజులు, వ్యాపార లైసెన్స్ ఫీజుల ద్వారా పంచాయతీలకు డబ్బులు సమకూరుతాయి. కాని చిన్న పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే నిధులు తప్ప ఇతర ఆర్థిక మార్గాలు లేవు. కాగా ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు పంచాయతీలవైపు కన్నెత్తి చూడకపోవడంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగి తప్పనిసరి పరిస్థితుల్లో చెత్త తరలింపు వాహనాలతో పాటు నీటి ట్యాంకర్లకు డీజిల్ కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించింది.

పైలెట్ మండలంగా గోపాల్‌పేట ఎంపిక

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: భూ భారతి–2025 రెవెన్యూ సదస్సుల **నిర్వహణకుగాను జిల్లాలో గోపాల్‌పేటను** పైలెట్ **మండలంగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్** సురభి **ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమ**వారం **నుంచి మండలంలో జరిగే రెవెన్యూ స**దస్సులను **మండల రైతులు సద్వినియోగం చేసు**కోవాలని **సూచించారు. మండలంలోని తొమ్మిది** గ్రామాల్లో **రెండు రెవెన్యూ బృందాలు నిర్ణయించిన** షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు భూ సమస్యల దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన సమస్యలను మే 13 నుంచి 20వ తేదీలోపు పరిష్కరించేలా సూచనలు చేస్తారని తెలిపారు. గ్రామ ప్రజలకు భూ సమస్యలకు సంబంధించిన నమూనా దరఖాస్తులు ముందుగానే పంపిణీ చేస్తారని, వాటిని సరిగా పూరించి రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఉష్ణోగ్రతలు పెరిగిన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని.. తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12లోపే బయటి పనులు పూర్తి చేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న వేళలో బయట తిరగకపోవడం మంచిదని, బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ లేదా గొడుగు వెంట తీసుకువెళ్లాలి, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం పొందాలన్నారు. వడదెబ్బ తగలకుండా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని.. చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికైన దుస్తులు ధరించడం ముఖ్యమని తెలిపారు.

విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవించాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఆదిత్య పరాశ్రీ స్వామీజీ

వనపర్తి టౌన్: విద్యార్థులు తల్లిదండ్రులను గౌరవిస్తూ వారు మెచ్చేలా విజయాలు సాధిస్తే భవిష్యత్ తరాలు బాగుపడతాయని అంబాత్రేయ క్షేత్ర వ్యవస్థాపకుడు ఆదిత్య పరాశ్రీ స్వామిజీ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రం సమీపంలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు ఆవరణలో వేప, రావి మొక్కలు నాటారు. అలాగే సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలుర, బాలికల, హరిజనవాడ, తెలుగువాడ ఉన్నత ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఆశీర్వదించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించేందుకు సర్వం ధారపోస్తున్నారని.. నైపుణ్యం కలిగిన చదువుకు సమాజంలో విలువ పెరుగుతుందని, విద్యార్థులు అక్షర, లోక జ్ఞానాన్ని తెలుసుకునేందుకు విద్యారంగంలో పురోగమించడమే ఏకైక మార్గమన్నారు. విద్యార్థులు కృషిని నమ్ముకొని దైవచింతన, సరైన ప్రణాళికతో ముందుకుసాగితే ప్రతి అడుగులోనూ విజయం తారసపడుతుందని చెప్పారు. యువతరం సన్మార్గం వైపు పయనించేందుకు పాఠ్య పుస్తకాల్లోనూ అధ్యాత్మిక భావన, సైన్స్ భావజాలాన్ని మేళవింపు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రోజురోజుకు పడిపోతున్న విలువల పునరుద్ధరణలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగంలో అధ్యాత్మికత లోపించడంతోనే వ్యవస్థ భ్రష్టు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించి మిఠాయి బాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, ఉపాధ్యాయులు తిరుపతి, రవికుమార్, రమాదేవి, గురురాజ్‌ప్రసాద్, నాయకులు దాడి యోగానందరెడ్డి, కంది వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

వనపర్తి రూరల్: మెప్మా ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో మెప్మా ఆర్పీల సంఘం (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్పీలకు పీఎఫ్, ఈఎస్ఐ, గుర్తింపు కార్డులు, డ్రెస్‌కోడ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి వాటి అమలుకు తీవ్రంగా యత్నిస్తోందని విమర్శించారు. దేశంలోని పరిస్థితిని సమీక్షించిన కేంద్ర కార్మిక సంఘాలు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని.. అన్నిరంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, కార్యదర్శి లావణ్య, కురుమూర్తి, వేణుగోపాల్, గోపమ్మ, మంజుల, కళావతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

'లేబర్ కోడ్స్ రద్దు చేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రం తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటం రాజు డిమాండ్ చేశారు. ఆదివారం పాలమూరులోని సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు అడ్వయిజరీ కమిటీ నియమించి కార్మికుల కోసమే నిధులు వెచ్చించాలని, కనీస పింఛను నెలకు రూ.9 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనెల రాములు, వరద గాలన్న మాట్లాడుతూ భవన నిర్మాణానికి ఉపయోగించే సిమెంటు, స్టీలు, పెయింట్, ఇతర సామగ్రి ధరలు తగ్గించాలన్నారు. నాయకులు గంజి వెంకన్న, పడాల వెంకటయ్య, వరద లక్ష్మయ్య పాల్గొన్నారు.

హాకీ గుర్తింపును మరింత పెంచాలి



క్రీడాకారులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్

వనపర్తి టౌన్: హాకీలో జిల్లాకు ఉన్న పేరును మరింత పెంచాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ క్రీడాకారులకు సూచించారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని రంగారెడ్డి జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళకువలను ఉపయోగించి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కుమార్, ప్రధానోపాధ్యాయుడు గురురాజ్, మన్యం యాదవ్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శాస్త్రవేత్తలు సోమవారం నుంచి జూన్ 13 వరకు ఆయా గ్రామాల్లో పర్యటించి రైతులకు వ్యవసాయ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని పాలెం ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలెం ఆర్ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఆయా గ్రామాల్లో పాల్గొని సాగునీటి ఆదా, నేల సంరక్షణ, పంట మార్పిడి, ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. నెలరోజులకు పైగా నిర్వహించే కార్యక్రమాల్లో గ్రామాల వారిగా రైతులు పాల్గొని తమ సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో సోమవారం తాడూరు మండలంలోని చర్లఇటిక్యాల, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఉంటుందన్నారు.

- 400 ఏళ్లు పాలించిన కాకతీయ సామంత రాజులు
- నేటికీ సజీవంగా చారిత్రక ఆనవాళ్లు
- గ్రామంలో జేష్ట్యాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడు
- రాష్ట్రంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి

2 వేల ఏళ్ల నాటి గ్రామం..

నందివడ్డెమాన్‌గా మారిన వర్ధమానపురం


నాగర్‌కర్నూల్: కాకతీయుల చరిత్రగా పిలిచే వర్ధమానపురమే నేటి నందివడ్డెమాన్. తెలంగాణలో వర్ధమానపురానికి 2 వేల ఏళ్ల ఘన చరిత్ర ఉంది. వర్ధమానపురాన్ని రాజధానిగా చేసుకుని 400 ఏళ్ల పాటు ఈ ప్రాంతాన్ని కాకతీయ సామంతరాజులు పాలించినట్లు చారిత్రక సాక్ష్యాలు చెబుతున్నాయి. గ్రామంలో నేటికీ ఆలయాలు, కోటగోడలు, శాసనాలే ఇందుకు నిదర్శనం. కాగా నాటి జైనమత ప్రచారకుల్లో కొందరు సన్యాసులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. వారి ప్రభావం వల్ల జైనమత తీర్థంకరుల్లో 24వ వాడైన వర్ధమాన మహావీరుడి పేరు మీద ఈ గ్రామానికి వర్ధమానపురం అనే పేరు వచ్చింది. గ్రామం వెలుపల నంది విగ్రహం ఉండడంతో నందివర్ధమానపురంగా పేరొందింది. ఇది కాల క్రమేనా నందివడ్డెమాన్‌గా మారింది. గ్రామం చుట్టూ ఎటు చూసినా ఆలయాలే దర్శనమిస్తాయి. ఇందులో ప్రధానంగా కాళిమాత, శివగౌరమ్మ, త్రిమూర్తులు, వీరభద్రస్వామి, నందీశ్వర, శనేశ్వరుడు, చెన్నకేశవస్వామి తదితర ఆలయాలు ఉన్నాయి.

వెళ్లొద్దాం

2000లో శనేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠాపన

జేష్ట్యాదేవి సమేత శనేశ్వరస్వామిని కొలిస్తే ఏల నాటి శని, అర్ధాష్టమ శని, అష్టమ శని తొలగుతుంది.. ఈ నమ్మకంతోనే వేలాది మంది భక్తులు ఉమ్మడి పాలమూరు పరిధిలోని బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్‌లో జేష్ట్యాదేవి సమేతంగా శనేశ్వరుడిని కొలుస్తున్నారు. రాష్ట్రంలోనే ఏకైక శనేశ్వర ఆలయం కావడంతో ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి శనివారం పూజలతోపాటు ప్రత్యేకంగా శని త్రయోదశి రోజు భక్తులు వేలల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని పూజలు జరుపుతారు.

నందివడ్డెమాన్‌లో వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఉన్న నంది, వీరభద్రస్వామి విగ్రహాలను 1976లో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ పాండే పిల్లలమర్రికి తరలించే ప్రయత్నం చేయగా గ్రామానికి చెందిన కొందరు పెద్దలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా నిలిపివేశారు. అనంతరం 1999 జనవరి 26న విగ్రహ పునఃప్రతిష్ఠ చేశారు. ఆ సమయంలో 11 రోజుల పాటు రుద్రయాగం చేసిన అర్చకులకు పక్షి రూపంలో ఒక చెట్టు వేరు కనిపించి పూర్ణాహుతి జరిగాక శనేశ్వర విగ్రహం ప్రతిష్ఠించాలని కలలో చెప్పడంతో విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. నందనవనం సుబ్బారాయుడు అనే శిల్పి ఆలగడ్డ నుంచి ఒక శిలను తెప్పించి ఏడున్నర రోజులపాటు శ్రమించి జేష్ట్యాదేవి విగ్రహాన్ని చెక్కారు. అనంతరం ఏప్రిల్ 17, 2000లో ఏడున్నర లక్షల శని మంత్రాలతో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కాకిపై కొలువై ఉన్న శనేశ్వరస్వామి విగ్రహం ఇక్కడ మనకు దర్శనమిస్తుంది.



మహిళలు సైతం పూజలు చేయొచ్చు..

శనేశ్వరుడికి అతీ ప్రీతికరమైన నల్లటి వస్త్రాలు ధరించి ఇక్కడ పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లేడు, జమ్మి ఆకు, నువ్వుల నూనెలతో స్వామివారికి అభిషేకం చేస్తారు. గుడి ఆవరణలో స్నానం చేసి నల్ల వస్త్రాలు ధరించి.. విగ్రహం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి.. స్వామివారికి నువ్వుల నూనెతో అభిషేకించి.. ఆ తైలాన్ని తలకు రుద్దుకుని మరోమారు స్నానం చేస్తారు. అనంతరం అక్కడే ఉన్న నంది శివలింగాన్ని దర్శించుకుంటారు. ఇక్కడ జేష్ట్యాదేవి సమేతంగా శనేశ్వరుడు కొలువుదీరి నందున మహిళలు సైతం ఈ పూజల్లో పాల్గొనవచ్చు.

ఇలా చేరుకోవచ్చు..

హైదరాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వచ్చే భక్తులు బిజినేపల్లి మండల కేంద్రానికి చేరుకుని.. అక్కడి నుంచి వడ్డెమాన్‌కు రావాల్సి ఉంటుంది. బిజినేపల్లి నుంచి వడ్డెమాన్‌కు వెళ్లే మార్గంలో ముందుకు ఎదురయ్యే కమాన్ (ఆర్చి) నుంచి 5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే శనేశ్వరుడి ఆలయం చేరుకోవచ్చు. హైదరాబాద్ నుంచి 122 కిలోమీటర్లు, మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రం నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఈ శనేశ్వరుడి ఆలయం ఉంటుంది.

గోన గన్నారెడ్డిది ఈ ప్రాంతమే..


కాకతీయుల సామంత రాజు గోనగన్నారెడ్డి ఈ ప్రాంతానికి చెందినవాడే. గోన బుద్దారెడ్డి తర్వాత వర్ధమానపురం రాజ పగ్గాలు చేపట్టిన గోన గన్నారెడ్డి రుద్రమదేవికి కుడిభుజంగా ఉండి సమస్త కాకతీయ రాజ్యాలను రక్షించిన యోధుడిగా చెప్పుకుంటారు.

భక్తుల నమ్మకం..



జేష్ట్యాదేవీ సమేత శనేశ్వరుడిని దర్శించుకోవడం వల్ల ఇక్కడ ఏల నాటి శని తొలగి.. అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భక్తుల నమ్మకం. అందుకే తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. స్వామివారికి అత్యంత ప్రియమైన నల్లటి దుస్తులతో అభిషేకం చేయడం వల్ల అన్ని దోశాలు తొలగిపోతాయి.

– శాంతికుమార్, అర్చకులు, శనేశ్వరస్వామి ఆలయం



వడ్డెమాన్ గ్రామ శివారులో కాళిమాత ఆలయం

క్లుప్తంగా

నీటి గుంతలో మునిగి వ్యక్తి మృతి

రాజాపూర్: ప్రమాదవశాత్తు నీటిగుంతలో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన పూజారి శీనయ్య (45) గ్రామ శివారులోని ఓ నీటి గుంతలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. గ్రామస్తులు గుర్తించి విషయాన్ని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు నీటి గుంతలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య పూజారి కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉత్తర్‌ప్రదేశ్‌వాసి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దుద్వానియా గ్రామానికి చెందిన నీరజ్ (22) జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పీఓపీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా గుర్తించిన తోటి కూలీలు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రేమ వ్యవహారంతోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బావ సునీల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మనవడిని కాపాడి.. తాత మృతి

కొల్లాపూర్ రూరల్: కేఎల్‌ఐ కాల్వలో మనవడిని కాపాడబోయి ఓ తాత మృతి చెందిన విషాద సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు చెప్పిన ప్రకారం.. కొల్లాపూర్ మండలం కుడికిల్లకు చెందిన ఆరేపల్లి శ్రీరాములు (60) తన మనవడిని తీసుకొని ఈత నేర్పించేందుకు గ్రామ సమీపంలో ఉన్న కేఎల్‌ఐ ప్రధాన కాల్వ వద్దకు వెళ్లాడు. మనవడికి వాటర్ బాటిళ్లు కట్టి కాల్వలో ఈతకు దింపాడు. బాబుకు కట్టిన బాటిళ్లు ఊడిపోవడంతో కాల్వ గట్టుపై ఉన్న శ్రీరాములు వెంటనే కాల్వలోకి దూకి మనవడిని గట్టుపైకి చేర్చాడు. అప్పటికే ఊపిరాడక శ్రీరాములు నీటిలో మునిగిపోయాడు. వారికి కొంత దూరంలో ఉన్న శ్రీరాములు కూతురు ఎల్లమ్మ వెంటనే అక్కడికి వచ్చి బాలుడిని పైకి తీసుకొచ్చి.. గట్టిగా కేకలు వేసి పక్కనే ఉన్న పొలంలోని రైతులను పిలిచింది. అక్కడి చేరుకున్న రైతులను శ్రీరాములును బయటికి తీసుకొచ్చి.. కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడికి భార్య బక్కమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడి.. మూడు లేగలు మృతి

తిమ్మాజిపేట: మండలంలోని చేగుంట సమీపంలో గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో మూడు లేగలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు ఎర్రగొల్ల భీమయ్య, యాదిరెడ్డి తమ గేదెలు, లేగలను శనివారం మేపి సాయంత్రం పొలం వద్ద కట్టివేసి ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం తిరిగి వెళ్లి చూడగా మూడు లేగలు చనిపోయి పడి ఉన్నాయి. వాటి శరీరాలపై ఏదో జంతువు గాయపర్చిన ఆనవాళ్లు కనిపించినట్లు బాధితులు తెలిపారు. ఫారెస్ట్ అధికారులు బోను ఏర్పాటుచేసి జంతువును బంధించి పశువులను కాపాడాలని కోరుతున్నారు.



మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థినులు



పరీక్ష కేంద్రం వద్ద నిరీక్షణ



గద్వాలలో పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్



ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద చెవికమ్మలు తీస్తూ..


‘నీట్’గా రాశారు..

- ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాల ఏర్పాటు
- 5,483 మంది విద్యార్థులకుగాను 5,343 మంది హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన పాలమూరు, గద్వాల కలెక్టర్లు, ఎస్పీలు





మహబూబ్‌నగర్‌లోని బాలికల కళాశాల పరీక్ష కేంద్రం విద్యార్థుల సందడి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/జడ్చర్ల టౌన్/హన్వాడ/గద్వాల టౌన్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్) అండర్ గ్రాడ్యుయేషన్–2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రాలతో పాటు జడ్చర్ల, హన్వాడలో 16 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 5,483 మంది విద్యార్థులకు గాను 5,343 మంది పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష సమయం ఉండగా.. మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతించారు. ఉదయం 11:30 నుంచి విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. ఆ తర్వాత బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్ తనిఖీ ప్రక్రియను అధికారులు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన పరీక్షకు 4,454 మందికి గాను 4,338 మంది హాజరయ్యారు. ఏనుగొండలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, మోడల్ బేసిక్ స్కూల్, హన్వాడ ఎంజేపీ బీసీ బాలికల గురుకులం, జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి తనిఖీ చేశారు.

- జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కేంద్రంలో 360 మందికి గాను 356 మంది పరీక్ష రాశారు. కళాశాల ముఖద్వారం నుంచే విద్యార్థులను ఒక్కొక్కరిని పరీక్ష కేంద్రంలోకి అనుమతించటంతో ఎండ వేడికి తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.
- హన్వాడ ఎంజేపీ బీసీ బాలికల గురుకులంలో 240 మంది విద్యార్థులకు గాను 234మంది పరీక్ష రాశారు. వీరిలో 169 మంది బాలికలు, 65మంది బాలురు ఉన్నారు. అయితే పరీక్ష కేంద్రానికి వచ్చేందుకు సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తనిఖీ చేశారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 1,029 మంది విద్యార్థులకు గాను 1.005 మంది (97.66 శాతం) హాజరయ్యారు. నిర్ణీత సమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లను మూసివేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే పట్టణంలో నీట్ పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులతో సందడి నెలకొంది. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్ సంయుక్తంగా పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు, మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఐలు బందోబస్తును పర్యవేక్షించారు.
- పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు చెవికమ్మలు, మెడలో ఉన్న బంగారు నగలు, ఇతర చైన్లు కలిగిన విద్యార్థులను అనుమతించలేదు. బూట్లను సైతం విప్పించారు. చేతికి ఉన్న దారాలతో పాటు మెడలో ఉన్న దారాలను కూడా అనుమతించలేదు. దీంతో విద్యార్థులు వాటిని తమ కుటుంబ సభ్యులకు అందజేసి పరీక్ష కేంద్రంలోకి వెళ్లారు.



ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు





కాళ్లకు మెట్టెలు తీస్తూ.. కాళ్ల పట్టీలు తీస్తూ..

ఖనిజ సంపద దోపిడీకే ఆపరేషన్ కగార్



రచయిత శ్రీ ఊహకు కందికొండ రామస్వామి స్మారక పురస్కారం అందజేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి తదితరులు

- నిర్దిష్ట సమయం లేని కులగణన
- గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నాగర్‌కర్నూల్ రూరల్/ కల్వకుర్తి రూరల్: దేశంలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు పంచిపెట్టేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్, కల్వకుర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నా.. బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని హతమార్చేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కర్రెగుట్ట చుట్టూ కేంద్ర బలగాలను దింపి మావోయిస్టుల పేరుతో అమాయక ఆదివాసీలను పొట్టన పెట్టుకుంటుందన్నారు. ఇప్పటికే 400 మందికిపైగా ఆదివాసీలను చంపేశారని ఆరోపించారు. అలాగే కులగణన చేపడతామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. నిర్దిష్ట సమయం చెప్పకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. చిత్తశుద్ధితో ఎప్పటిలోగా సర్వేను పూర్తిచేస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిశ్రమల పెట్టుబడిదారులకు అప్పగించేందుకే చట్ట సవరణ చేసిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. ఈ నెల 7నుంచి హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ అందాల పోటీల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని చెప్పడం సిగ్గుచేటన్నారు. అందాల పోటీలతో పాశ్చాత్య సంస్కృతి రాజ్యమేలుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి కల్వకుర్తికి వచ్చిన ఆయనను ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం పాలమూరు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి జాన్‌వెస్లీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలోసీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు, మల్లయ్య, శివరాములు, బాలస్వామి, శ్రీనివాసరావు, దేశానాయక్, గీత, ఆంజనేయులు, అశోక్, శ్రీనివాసులు, ఈశ్వర్, నర్సింహ, శివవర్మ, మధు, కాశన్న, శివరాం, సురేశ్, కుర్మయ్య, నాగరాజ్‌గౌడ్, రవి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణమే ధ్యేయం

దోపిడీ వ్యవస్థల నిర్మూలన, సమసమాజం నిర్మాణం కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని అలాంటి వ్యక్తుల్లో కందికొండ రామస్వామి ఒకరు అని వక్తలు అభిప్రాయపడ్డారు. నాగర్‌కర్నూల్‌లోని సింగిల్ విండో హాల్‌లో ఆదివారం నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బల్కాన్ బ్యాక్ ప్యాక్ కథలు పుస్తక రచయిత శ్రీఊహకు కందికొండ రామస్వామి స్మారక జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలను సంఘటితం చేసిన పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని, ఈ పోరాటానికి ప్రపంచ గుర్తింపు ఉందన్నారు. బాంచన్ కాల్మొక్త దొర అన్న నినాదానికి వ్యతిరేకంగా తుపాకీ ఎక్కుపెట్టి పోరాడారన్నారు. అలాంటి విలువ కలిగిన వ్యక్తుల పేర్ల మీద పురస్కారాలు అందించడం ఆనందంగా ఉందన్నారు.

పాలమూరులో అలరించిన శ్రీకృష్ణ తులాభారం



నాటక ప్రదర్శన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీ.జితేందర్‌రెడ్డి



ఆకట్టుకున్న శ్రీకృష్ణతులాభారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీకృష్ణ తులాభారం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళా కళాకారిణులు ఈ పౌరాణిక పద్యనాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణగా నంబి అనూష, సత్యభామగా జి.శిరీష, రుక్మిణిగా పి.గోదారెడ్డి, నారదుడిగా పి.అరుణారెడ్డి, వసంతకుడు పాత్రను చవ్వసునీత, నళినిగా అనూషలు నాటకంలో తమ పాత్రలను చక్కగా ప్రదర్శించారు. నేటి తరానికి నాటకరంగ ప్రాముఖ్యతను తెలపాలి నేటి తరం విద్యార్థులకు నాటకరంగ ప్రాముఖ్యతను తెలియజేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పద్యనాటక ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళలు పద్యనాటకాన్ని ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. ఈ నాటకాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదర్శించేలా చూస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, నాటక రచయిత పల్లెర్ల రాంమోహనరావు, సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మాస్టర్ వేణుగోపాలచారి, స్వరలహరి కల్చరల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు నాయిని భాగన్నగౌడ్, డీకే.ఆంజనేయులు, మేకల శ్రీనివాస్, గంగాపురం పవన్‌కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న సినీ నటుడు



అలంపూర్: అలంపూర్ ఆలయాలను సినీ నటుడు ఆది ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలకగా.. జోగుళాంబ అమ్మవారు, బాలబ్రహ్మేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయన విశిష్టతను వివరించి తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు.

భూసార పరీక్షలే భూమికి రక్ష

పాడి-పంట

గద్వాల జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్



మట్టి నమూనా సేకరణకు విభజించిన నాలుగు భాగాలు

అలంపూర్: భూసార పరీక్షలు భూమికి రక్షణగా నిలుస్తాయి. భూమిలోని పోషకాలు, వాటి లోపాలు తెలుసుకోవడానికి, అందుకు అనుగుణంగా పంటలు సాగు చేయడానికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడులు సాధించాలనే ఆలోచనతో రైతులు మితిమీరిన రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నాణ్యమైన దిగుబడులు లేకపోగా.. చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం, చౌడు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి భూసార పరీక్షలు తప్పనిసరిగా మారాయని తెలిపారు.

భూసార పరీక్ష అంటే..?

పొలం నుంచి సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి వాటి లక్షణాలు.. ఉన్న పోషకాలు.. తక్కువగా ఉన్నవి, మధ్యస్థంగా ఉన్నవి ఏమిటి? తెలుసుకొని వాటి ఆధారంగా ఏ పంట వేసుకోవాలో నిర్ణయించుకొనే అవకాశం ఉంటుంది. అందుకు ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలో తెలుసుకోవడమే భూసార పరీక్షలు.

మట్టి నమూనాల సేకరణ..

పంట కోత తర్వాత వేసవిలో, పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు జాగ్రత్తగా తీసి పంపాలి. ఎరువులు వేసిన తర్వాత నెల వరకు మట్టి నమూనాలు తీయకూడదు. నీరు పెట్టిన తర్వాత, నీడ ఉండే ప్రదేశాలు, నీటి ముందున్న ప్రాంతాల్లో మట్టి నమూనాలు సేకరించరాదు. ఎరువుల కుప్పల వద్ద, గట్ల వద్ద, చెట్ల దగ్గరి ప్రాంతాల్లో మట్టిని తీయరాదు.

ఎంత విస్తీర్ణానికి..

ఒక పొలానికి ఒక నమూనా తీయాలి. పొలం విస్తీర్ణం అధికంగా ఉంటే ప్రతి రెండు నుంచి ఐదు ఎకరాలకు ఒక నమూనా సేకరించాలి. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాల్లో తేడాలు కనిపిస్తే అన్ని రకాల నమూనాలు పొలం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది.

- వ్యవసాయ పంటలకు 6 అంగుళాలు, పండ్ల తోటలకు 5 నుంచి 6 అడుగుల వరకు ప్రతి అడుగుకు ఒక నమూనా, చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి.

నమూనాల సేకరణ ఇలా..

నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తొలగించాలి. ఆగర్ లేదా పార ద్వారా నమునాలు సేకరించాలి. పొలంలో ‘వి’ ఆకారంలో గుంతలు తీయాలి. గుంత అంచుల నుంచి పారతో గాని లేదా తాపీతో గాని మట్టిని సేకరించాలి. పొలంలో 8 నుంచి 10 స్థలాల్లో మట్టిని సేకరించాలి. సేకరించిన మట్టిని కలిపి నేల మీద పరిచి దానిని నాలుగు భాగాలు చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకొని మిగిలిన మట్టిని పారవేయాలి. ఇలా అర కిలో మట్టి నమూనాలు సేకరించాలి. ఆ మట్టిని వస్త్రం లేదా పాలిథిన్ సంచిలో నింపి అందులో రైతు పేరు, చిరునామా, సర్వేనంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట/పల్లం/ఆరుతడి పంటలు, మూడేళ్లుగా వాడుతున్న ఎరువులు, రాబోవు సీజన్‌లో వేయాల్సిన పంటలు, సేకరించిన తేదీ వివరాలతో భూసార పరీక్షా కేంద్రాలకు పంపాల్సి ఉంటుంది. తగిన జాగ్రత్తలతో మట్టి నమూనాలు పంపితే కచ్చితమైన ఫలితాలు వస్తాయి.

పెళ్లి చేస్తామని చెప్పినా.. వినలేదు

బాలానగర్ మండలం చిన్నరేవల్లిలో ప్రేమజంట ఆత్మహత్య

రాజాపూర్(బాలానగర్): మైనారిటీ తీరలేదని మేజర్ అయ్యాక పెళ్లి చేస్తామని కుటుంబసభ్యులు చెప్పినా వినకుండా మనస్తాపంతో ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం.. చిన్నరేవల్లి గ్రామానికి చెందిన ఎట్టి శివప్రసాద్(17) అదే గ్రామానికి చెందిన వర్షిత (18) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్న శివప్రసాద్.. వర్షితను ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని తండ్రి ఎట్టి జంగయ్యకు తెలిపారు. ఇంత చిన్నవయసులో పెళ్లి ఎందుకు.. మైనారిటీ తీరలేదని, మేజర్ అయ్యాక ప్రేమించిన అమ్మాయికే ఇచ్చి పెళ్లి చేస్తానని చెప్పాడు. ఈ విషయం తెలిసిన వర్షిత ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వర్షిత చనిపోయిన విషయం తెలిసిన శివప్రసాద్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గ్రామశివారులోని ఓ రైతు వ్యవసాయపొలం వద్దకు వెళ్లి పశువుల కొట్టంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల రైతులు గమనించి మృతుడి తండ్రికి సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శివప్రసాద్ మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి, వర్షిత మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. మృతుడి తండ్రి ఎట్టి జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిపై జింక మృతి

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై జింక మృతి చెందడంతో వాహనదారులు గుర్తించారు. శనివారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. ఆదివారం బ్లూకోర్టు పోలీసులు అబ్దుల్, ఖాదర్, జింక మృతదేహాన్ని గుర్తించి ఔట్‌పోస్టుకు తరలించి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి జింక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కళేబరాన్ని పూడ్చివేశారు.

రెండు కార్లు ఢీ.. పసికందు మృతి

మిడ్జిల్: రెండు కార్లు ఢీకొని మూడు నెలల పసికందు మృతిచెందగా.. మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు కథనం ప్రకారం.. మండలంలోని రాణిపేట శివారు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌కు చెందిన 3 నెలల శిశువు మృతిచెందగా.. సాయికుమార్, దీపిక, కావ్య, దోనూరుకు చెందిన భిక్షపతి, మరో మహిళ తీవ్ర గాయాలవడంతో ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరో కారు ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో ఎవరికీ గాయాలు కాలేదు. డ్రైవర్ రెహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దోనూరులో జరిగిన వివాహానికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెప్పారు.